[అభూత కల్పన]

# కళాభిమానం

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

కళను ఉద్ధరించటానికి కంకణం కట్టాడు కళాభిమాని ముందుగా వ్రాతపూర్వకమైన అనుమతి కళవద్ద పొందుదామన్న ఆలోచన కూడా కలగలేదు కళాభిమానికి. కళాభిమానం అజేయంగదా!

ఏదో ఒక కళను పట్టుకుని, దాన్ని మచ్చికచేసి, సింగారించి, లోకానికి ప్రదర్శించి, ప్రజలకు కళద్వారా బ్రహ్మానందమూ, బ్రహ్మసాయుజ్యమూ, బ్రహ్మసారూప్యమూ ఇప్పించటానికి కళాభిమాని నడుముకు ప్లాస్టిక్ బెల్టుతో గట్టిగా బిగించినవాడై కళలను వెంబడించాడు.

మిగతా అన్ని కళలూ తప్పించుకు పారిపోగా నాట్యకళ అనబడే నాటకకళ, కుంటిది కావటంవల్ల, సులభంగా కళాభిమానికి పట్టుబడింది.

ఈవిధంగా చేజిక్కిన నాటకకళను కళాభిమాని ఆపాదమస్తకం అవలోకించాడు.

"ఈ నాటకకళ ఇంత కుంటిదెందుకయింది? మిగిలినకళలవలె ఇది ఎందుకు తప్పించుకు పారిపోలేకపోయింది?.. హాఁ! తెలిసింది! దీని కాళ్లకు ధనపాశం చుట్టుకొని ఉంది. ఈ ధనశృంఖలాలను తెంచితేనేగాని ఈ నాటకకళ పరుగులు తీయదు, ఆడదు, లాస్యం చేయదు!"

నాటకకళకు ధనవిమోచన కలిగించటానికి ఉపక్రమించాడు కళాభిమాని.

"ఈ కళామతల్లిని చూడండి ఈవిడ ఎందు కిట్లా కుంగి క్రుశించిఉన్నదో గమనించండి. ఆమెకాళ్లకూ చేతులకూ ఉండే ధనశృంఖలాలను తెంచండి. కళాభిమానులు ముందుకు రండి!" అని కళాభిమాని ఎలుగెత్తి ప్రజలను పిలిచాడు.

ప్రజలు చుట్టూ మూగారు. అందులో చాలామంది కళోద్ధరణ సందర్శించటానికి మాత్రమే వచ్చారు కొద్దిమంది కళాభిమానులూ, కళాభిమానిపిలుపుతో ఉత్తేజితులైనవాళ్లూ నాటకకళామతల్లిని సమీపించటానికి ప్రయత్నించారు కాని కళాభిమాని వారిని అంతదూరానే ఉంచాడు.

"ఈ నాటకంలో నాయకపాత్ర నాది. మీరు హంగుదార్లు. నాటకకళను వెంటబడి పట్టుకున్నది మీరా నేనా?" అన్నాడు కళాభిమాని.

"ఆహా! అపూర్వకళాభిమాని!" అన్నారు ప్రజలు.

అటువంటివాణ్ణి అనసరించినా కొంత కీర్తి ఉంటుందని కొందరు కళాభిమానికి సాయం చేయటానికి ముందుకు వచ్చారు.

"నాటకకళను పునరుద్ధరించాలంటే మనం ధనశృంఖలాలను తెంచాలి మనమే ముందు ధనశృంఖలాలనుంచి బయటపడాలి" అన్నాడు కళాభిమాని.

(ఇక్కడినుంచీ ఈ కథలో ధనశృంఖలాలు ప్రధానపాత్ర.)

నాటకకళామతల్లి యొక్క ధనశృంఖలాలు తెంచటానికిగాను కళాభిమాని చందాలు పోగుచేశాడు. ధనశృంఖలాలకు స్వస్తిచెప్పి కళార్చన చేయటానికి ముందుకు వచ్చినవారి సహాయంతో కళాకీర్తనా, కళాభజనా, కళార్చనా ఆరంభించాడు కళాభిమాని. ప్రజలు అటుకేసి రాలేదు.

ఇంత ఉన్నతాదర్శాలతో ప్రారంభమైన కళాసేవ ప్రజలను ఆకర్షించటంలేదు, వారికి ఏమాత్రమూ ఆనందం ఇవ్వటం లేదు. నాటకకళామతల్లి దాస్య (ధన) శృంఖలాలను తెగతెంచటం ఒక పరమార్థమనీ, కళామతల్లినుండి తుచ్ఛమైన, ఆముష్మికరహితమైన, క్షణికమైన, బుద్బుదప్రాయమైన, ఆత్మసంశ్లేషణ లేని వినోదమూ, ఆనందమూ ఆశించటం శోచనీయమనీ ప్రజలు గ్రహించటం లేదు వారు ధనశృంఖలాలతో గూడిన కళనే ఎక్కువగా గౌరవిస్తున్నారు.

"మనకు డబ్బు చాలటంలేదన్నది శోచనీయం. ఇంకా ఎక్కువగా, ఇతోధికంగా, చందాలు వసూలు చెయ్యాలన్నది విదితం! మనం పోగుచేసిన డబ్బుతో కిరాయినాటకాలాడించిఉంటే ఈపాటికి లక్షరూపాయలు లాభం వచ్చిఉండేది. ప్రజలు ఆనందించిఉండేవాళ్లు. కాని మనఆశయం అదికాదు. మన ఆశయం కళామతల్లిని బంధించే ధనశృంఖలాలను తెంచి, ఆతల్లి ఎవరికీ అందకుండా పారిపోయేటట్లు చెయ్యటం! కళామతల్లిని గగనవీధిన అత్యున్నతంగా ప్రతిష్ఠించటం," అన్నాడు కళాభిమాని.

ఆయనఅనుచరులు కళామతల్లిదాస్యశృంఖలాలను తలుచుకుని నిట్టూర్చారు. తాము వాటిని ఆరాధించనందుకు లోలోపల విచారించారు. కళాభిమాని కళాకీర్తనలకిందా, కళాభజనలకిందా, కళార్చనలకిందా సొమ్మంతా హుమ్మచేసి ఇతికర్తవ్యతావిమూఢుడైఉన్నాడని గ్రహించినవారై అందరూ జారుకున్నారు

ఎవ్వరూ లేని కళాసమావేశంలో కళాభిమాని కళాసేవను అవధిలేని వాయిదా వేస్తూ ఏకగ్రీవంగా తీర్మానించాడు ఆ తీర్మానాన్ని బలపరచటానికైనా ఇంకో గ్రీవం లేదు



మోసం కాదు!

వైద్యుడు ఏమిటీ నాలుక చాచటం?
రోగి: నాలుక చూపమన్నారు కాదండీ! నాకు ఉన్న నాలుకంతా అదేనండి! మళ్లీ మోసం చేస్తున్నాననుకొంటారేమోనని పూర్తిగా చాచాను.

కొన్ని సంవత్సరాలు గడిచాయి. ధనశృంఖలాబద్ధమైన నాటకకళామతల్లి, ఆరాధించేవారు లేక, మళ్ళీ దినదినప్రవర్ధమానమయింది. ధనార్చనాపరులైన నటులూ కిరాయివాళ్లూ ఆవిడచేత ప్రజలకు వినోదం ఇప్పించారు. ఆనందం ఇప్పించారు. ప్రజలు కళామతల్లిపై కనకవర్షం కురిపించారు.

కళాభిమాని ఆలోచించాడు. కళామతల్లిని బంధించిన ధనశృంఖలాలను చూసి తాను భయపడటంవల్ల కించిత్తయినా ప్రయోజనం కలగలేదు. ఆ శృంఖలాలను విడగొట్టవలసిందే. కాని వెంటనే కాదు. అందు కవసరమైన ధనాన్ని ఆ శృంఖలాలతోనే సంపాదించాలి ఇదే కర్తవ్యం.

మళ్లీ పౌర్ణమి వచ్చింది. కళాభిమాని శంఖం పూరించాడు. కళాయజ్ఞాలూ, కళాసంతర్పణాలూ, కళోత్సవాలూ ఏర్పాటుచేశాడు. ఈసారి కళార్చనకు ధనశృంఖలాలను ఆరాధించేవారినే ఏరాడు. వాళ్లు రామనలేదు, వచ్చారు.

అతివైభవంగా కళావేడుకలు ముగిశాయి. పత్రికలనిండా వార్తలూ, ఫోటోలూ, పెద్దల ఉపన్యాసాలూ పడ్డాయి. అనేకవేలమంది కళాభిమానులు కాంప్లిమెంటరీ టిక్కెట్లు పుచ్చుకోవటానికి ఒప్పుకొని నాటకాలు చూసివెళ్లారు. కట్టె కాలగా బూడిద మిగిలినట్టు చివరకు అప్పు మిగిలింది. కళామతల్లి శృంఖలాలు చెక్కుచెదరలేదు. అవి ఎప్పటికన్నకూడా మరింత ప్రకాశిస్తున్నాయి. కళోద్ధరణ ఎప్పటిస్థితిలోనే ఉన్నది.

మరి కొన్నేళ్లు గడిచాయి. కళాభిమాని విరక్తుడైనాడు.

"ఈ కళజాతికర్మే ఇంత! దీన్ని నేను ఉద్ధరించలేకపోయినతరవాత ఇంకెవరూ ఉద్ధరించలేరు. ఈ ప్రజలే ఇంత! వీళ్లు ఉన్నతమైన కళను ఆరాధించలేరు. నా కాలం వృధాచేసుకున్నాను. కొంత కీర్తి తెచ్చుకున్నాను కాని చాలదు. ఇంకా రావాలి. ఇంకా చాలా రావాలి."

తన కెవరో పోటీ బయలుదేరినట్టు కళాభిమాని పత్రికలలో చదివాడు. ఇన్నేళ్లుగా కళాసేవ చేస్తూన్న తనకు ఊరూ పేరూ తెలియనివాళ్లు నాటకకళామతల్లికి దాస్యవిమోచన కలిగించి ప్రజాసేవచేస్తున్నారనీ, విపరీతంగా ప్రజాదరణ సంపాదిస్తున్నారనీ నాలుగువైపులనుంచి విని కళాభిమాని ఖిన్నుడైనాడు. కాని కాలక్రమాన ఈ కళాసేవ



కులు ప్రభుత్వంవారి ఆగ్రహానికి గురిఅయినారని విని విచారించటం మానేశాడు.

మళ్లీ పౌర్ణమి సమీపించింది. కళాభిమాని శంఖం పూరించాడు.

ఈసారి అపజయం కలగరాదు. డబ్బు మిగలాలి. లాభం రావాలి. కళార్చన జరగాలి. ఈసారి తన కెవరు సహాయం చేసేవారు? ధనశృంఖలాలను వదిలించుకున్నవాళ్లు నష్టం తెచ్చారు. ధనశృంఖలాలను ఆరాధించేవాళ్లు మరింత నష్టం తెచ్చారు. ఇక పోతే ఎవరున్నారు. అమాయకులూ, సరళస్వభావులూ, నిర్మలచేతస్కులూ అయిన చంటిపిల్లలున్నారు. వెర్రాసుపత్రిలో పిల్లలకన్న అమాయకులైన వెర్రివాళ్లున్నారు. ప్రజలను బలంగా ఆకర్షించేది వీళ్లే.

భయంకరమైన వ్యాధులు కలవాళ్లు తమ వ్యాధులు ప్రదర్శించి అడుక్కున్నట్టు, రెండుతలల పిల్లలనూ, శరీరాలు అంటుకుపోయినవాళ్లనూ ఎగ్జిబిషనులో పెట్టి టిక్కెట్లుపెట్టినట్టు, కళాభిమాని వెర్రివాళ్లచేత నాటకకళామతల్లికి సేవ చేయించి డబ్బు వసూలుచేశాడు.

కళామతల్లి ఆనందపారవశ్యంలో మూర్ఛపోయి ఊపిరిపీల్చటం మానేసింది. రోదిస్తూ తెర పడింది.

---


# లైను, హాఫ్‌టోన్, కలరు

## బొమ్మలు

## బొమ్మలులేని దేరాణింపులేదు

బొమ్మలు లేనిదే నేడు పత్రికలుగాని, పుస్తకాలుగాని, కాలెండర్లుగాని రాణించడంలేదు. మంచి బొమ్మలకు మంచి బ్లాకులు ఆధారం. కనుక ఎవరికి ఏ బ్లాకులు కావలెనన్నా

**అన్నిరకాల బ్లాకులూ, అన్నిరకాల ముద్రణకూ అనుకూలంగా ముచ్చటగా తయారుచేసి ఇస్తాము.**

**మేనేజరు, ఆంధ్రపత్రిక, మద్రాసు 1.**